# కథకాని కథ

ఆరోజు మనసేం బాగుండలేదు. ఊరు కాని వూళ్ళో మన ఊసే అడిగేవాడు లేనప్పుడు మన మనస్సును గురించిన అజ ఎవరికి కావాలి? మాయింటి యజమానీ ఆయన కుటుంబం పండుగ సందడిలో పడి పూర్తిగా నావిషయం మరచిపోయారు. ఇహ కాలంగడపటానికి చిన్న ఉపాయం- ఏదైనా సినిమాచూచి సాయంకాలం ఒకటి రెండు గంటలు ఊరంతా బలాదూరు తిరిగి రావటం. భోజనంచేసి, పూర్తిగా ముస్తాబై బస్సు స్టాండు దగ్గరకుజేరా. అక్కడ అప్పుడే నాలాంటివాళ్ళు కొన్నివందలమంది సిద్ధంగా వున్నారు. బస్సురావటం తరువాయి అంతా ఒక్కసారిగా దానిమీద ఎగబడటం. లోపలినుంచి కండక్టరు అక్షింతలు వేసి క్రిందకు దింపటం. ఇల్లా యీ తతంగం ఎంతసేపటినుంచి జరుగుతోందో నాకు తెలియదు కాని, నా కళ్ళఎదుట ఆరు బస్సులు అలా వెళ్ళిపోయాయి. పోనీ టాక్సీలో వెడదామంటె కనుచూపు మేరలో వాటి జాడలేదు.

టైము రెండుగంటలని గడియారం చెబుతోంది. తిరిగి యింటికి వెళ్ళిపోదామనిపించింది. ఇంటికి వెళ్ళి మాత్రం మనం చేసేదేముంది?

అపుడు యింకో ఆలోచన వచ్చింది. నే నాబస్‌కే వెళ్ళాలని సిద్ధాంత మేమిటి? ఏ బస్సు ఖాళీగావుంటే దాంట్లో ఎక్కి అది ఎక్కడకు తీసుకెళ్ళితే అక్కడకు వెళ్ళిపోదాం. పటేలు నగరం వెళ్ళే బస్సు దాదాపు ఖాళీగావుంది. జనం కూడ అట్టేమంది లేరు. దాంట్లో ఎక్కి కూర్చున్నా. టర్మినస్ జేరి బస్సు వెనక్కి తిరిగింది.

బస్సు ఆగినచోట అంతా నిర్మానుష్యంగా వుంది. ఇక్కడికి వచ్చాను కాని చేసేదేముంది? రెండో బస్సు యింకొక అరగంటకు కాని బయలుదేరదు. ఈ లోపల కొంచెందూరం అట్లా తిరిగి వస్తే? పోనీ వచ్చినత్రోవనే కొంచెందూరం నడచి బస్సు ఎక్కడదొరికితే అక్కడ ఎక్కి వెళ్ళిపోతే? వెడల్పయిన రోడ్లు- ఎటుచూచినా అందమైన యిళ్లు - ఒక్కొక్క యింటినీచూస్తూ నడక ప్రారంభించాను. ఒక యింటిదగ్గర రెండు మూడేళ్ళ కుర్రవాడొకడు, పెద్ద ఆల్సేష్యన్ కుక్కని తోకపుచ్చుకొని యింట్లోకి లాక్కువెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. తెల్లటి కుర్రవాడు- నల్లటికుక్క. ఆ దృశ్యం చూడగానే నవ్వు వచ్చింది. పిల్లవాడిని కుక్క కరుస్తుందేమో ననే భయంకూడ వేసింది. ఆ కుర్రవాడిని చూడగానే, ఎవరో అత్యంత ఆత్మీయులు గుర్తుకు తెచ్చాడు. "బాబు యిల్లారా" అని పిలిచాను. కుర్రవాడు ఆశ్చర్యంతో

నావంక చూచాడు. ఈ సందట్లో కుక్క తప్పించుకుని యింట్లోకి పారిపోయింది. కుర్రవాడుకూడా దానివెంట పరుగెత్తుతూ, దోవలో ఏదోచూసి ఆగాడు. నేను మళ్ళీ "బాబూ!" అని పిలిచాను.

కుర్రవాడు సందేహిస్తూ నాదగ్గరకు నడచాడు. ఆ ముఖం, చివరకు గడ్డంమీద పుట్టుమచ్చకూడా అదే.

"నీపేరేమిటి?" అని అడిగా.

"చుందర్" అని వచ్చీరాని మాటలతో అన్నాడు.

"సుందర్!" ఈమాట వినగానే నా మనస్సు వెర్రి పరుగులు తీసింది. ఆ కుర్రవాడిని ఎత్తుకొని ముద్దుపెట్టుకున్నా. పరాయివాడు ఎవరైనా ఎత్తుకుంటే పిల్లలు గగ్గోలు చేస్తారు. వీడుకూడా అదే ప్రయత్నంలో వున్నాడు.

ఇంతలో యింట్లోంచి ఎవరో బయటకువచ్చారు. వ్యక్తిని చూశాను. అల్లాగే నుంచున్నా.

కమల!!!

నా హృదయాన్ని దొంగిలించి, నాతో చెప్పకుండా ఎక్కడికో అదృశ్యమయిన కమల!

అనేక సంవత్సరాలక్రితం ఒకరోజు వుదయం నేను నిద్రలేచి మేడమీద నుంచి క్రిందకు వస్తుంటే ప్రక్కయింటికి ఎవరో క్రొత్తవాళ్ళు వచ్చి ప్రవేశిస్తున్నారు. మహా పట్టణాలలో యిలాయిళ్ళల్లోకి పాతవాళ్ళు వెళ్ళగానే క్రొత్తవాళ్లు రావటం, వాళ్ళు కొంతకాలంవుండి యింకొకచోటుకు వెళ్ళడం సర్వసాధారణంగా జరిగే సంఘటన. ఒక ఉత్తరహిందూ స్థానం వ్యక్తి- ఆయన భార్య- పుత్రిక- యింట్లోకి ప్రవేశిస్తున్నారు. నేనావిషయం వెంటనే మరచిపోయాను. రెండు మూడు రోజుల తరువాత కాలేజినుంచి యింటికి వచ్చేసరికి ప్రక్కయింటి అమ్మాయీ- మా పిన్ని కూతురు- యిద్దరికి రానిభాష హిందీ. దాంట్లో ఏదో సీరియస్‌గా మాట్లాడు కుంటున్నారు. నేను మా పిన్నికూతురిని "కమలా" అని పిలిచాను. ఆ పిల్ల వులిక్కిపడి నావంక జూసింది. మా చెల్లెలి దగ్గరకు రాగానే "ఎవరే ఆ చిన్నది?" అని అడిగా.

"ప్రక్క యింట్లోకి కొత్తగా వచ్చారు. స్నేహం చేసుకొనడానికి వచ్చింది."

"పేరు?"

"కమల."

"ఇంకేం? పేర్లు కలసినప్పుడు స్నేహాలు కలవడం ఎంతసేపు?"

"పోరా! నీకెప్పుడూ హాస్యాలే" అని క్రొత్త స్నేహితురాలి దగ్గరకువెళ్ళి మా సంభాషణ హిందీలో అనువాదం చేసి చెబుతూంది. నేను బజారువెళ్ళే ప్రయత్నంలో ఉండగా ఆ పిల్లను నాకు పరిచయంచేసింది. హిందీలో వారు వచ్చినవల్లా నాకు నాలుగైదు మాటలు. అందుకని ఇంగ్లీషులో చెప్పా సమాధానం. ఆ పిల్లమాత్రం ఎంతసేపూ హిందీలో మాట్లాడుతోంది. అప్పుడు మనస్సుకు అనిపించింది. కనీసం యీ చిన్నదానితో మాట్లాడడానికైనా హిందీ నేర్చుకోవాలి" అని.

తెలుగుదేశంనుంచి వచ్చిన నేను, ఎక్కడో కాశ్మీరులో పుట్టి లాహోరులో పెరిగిన కమల, ఒకరిభాష ఒకరికి అర్థం కాకపోయినా- ఒకరి మనస్సు ఒకరికి తెలిసిందంటె అది ఎన్నిజన్మల స్నేహం, అనురాగం ఫలితమో అయివుండాలి. మా యిద్దరికీ పరిచయంచేసిన వ్యక్తి దూరంగానే వుండిపోయింది. మేముమాత్రం అనతికాలంలోనే ఆత్మీయులమై పోయాము. మా యిద్దరిమధ్య ప్రేమలు, వలపులు వున్నట్టు కూడా తెలియని వయస్సది. తెలిసిందల్లా మేము ఇద్దరం ఒకటని.

ఒకరోజున యిద్దరం లాల్‌బాగ్‌లో కూర్చున్నప్పుడు "నేనంటే నీకెందుకింత ఇష్టం?" అని అడిగా.

"నువ్వు చాలా మంచివాడివి" అని అంది.

"మీజాతిలో ఎంతోమంది అందమైన వాళ్ళుండగా నల్లటివాడిని నామీద ఎందుకింత ఆపేక్ష?"

"వాళ్ళు అందంగానే వుంటారు. వాళ్ళ మనస్సులు అందమైనవి కావు... వాళ్ళల్లో ఎవ్వరితో చనువుగావున్నా, నన్ను పెడత్రోవకి నెట్టడానికి ప్రయత్నం చేసేవాళ్ళు.... కాని నీతో మాట్లాడుతూవుంటే, నేను లోకం విషయమే మరచి పోతాను."

"అంతేనా?"

"అంతేకాదు. నిన్ను చూడగానే చెప్పలేనంత సంతోషం కలుగుతుంది.'

"కవిత్వం మాట్లాడుతున్నావు."

"కవిత్వంకాదు. నేను మనస్సులో రోజూ అనుకొనే మాట."

మనస్సులో మాటలు అనేకం మామధ్య జరిగాయి. బయట నలుగురూ మమ్మల్ని గురించి ఏమనుకుంటున్నారూ ఏం చేస్తున్నారూ అనే జిజ్ఞాస ఏనాడూ మాకు కలగలేదు. ఈర్ష్యతో ద్వేషంతో నావంక అంతా చూస్తున్నారని మేము ఏనాడూ గ్రహించలేకపోయాము.

ఒకే ఒక్కసారి మా యిద్దరికి ఎడబాటు కలిగింది. అది శాశ్వతంగా నిలచి పోతుందని లవలేశమైనా తెలిసి ఉంటే కమలని ఎన్నటికీ వదిలేవాడిని కాదు.

ఆరోజు శుక్రవారం నేనూ కమలా సినిమాచూసి యింటికి వస్తున్నాం. నేను పనిమీద వూరు వెడుతున్నాను. సోమవారం కలుస్తాను" అని అన్నా.

"తొందరగా రా" అని అంది.

మా త్రోవలు వేరు అయ్యే చోటువచ్చింది. వదిలి వెళ్ళబోతుంటే మనస్సు చివుక్కుమన్నది. చెయ్యాని పని ఒకటిచేశా. కమలను దగ్గరకుతీసుకుని ముద్దు పెట్టుకున్నా. కోపంతోనూ, సిగ్గుతోనూ ఆ పిల్లదాని ముఖం ఒక్క క్షణం మరీ ఎర్రబడింది.

"ఎవరైనా చూస్తే?" అని అన్నది.

మర్నాడు వెళ్ళిన నేను రెండురోజులకుకాదు రెండు మాసాలదాకా తిరిగి రాలేకపొయ్యాను. చివరకు తిరిగి వెళ్ళవలసిన అవసరం లేకపోయింది.

విరహం, ఏకాంతం బాధిస్తున్న ఒకనాడు కమలకు ఉత్తరం రాశాను. "నువ్వు దగ్గరలేని ప్రతిక్షణం ఒక యుగంలాగా వుంది. ఎప్పుడువచ్చి నీ సన్నిధిలో నిలుస్తానో" అని. దానికి వెంటనే సమాధానం వచ్చింది.

"నువ్వు రాసిన వుత్తరం మానాన్న చేతుల్లో పడ్డది. ఎన్నడు నన్నేమి అననివాడు, జీవితంలో మొదటిసారి నామీద చెయ్యితీసుకున్నాడు. నేను రాసే వుత్తరం నీకందుతుందో లేదో చెప్పలేను. నీతో మాట్లాడనని, నిన్నసలు ఎన్నడూ చూడనని నాచేత ప్రమాణం చేయించుకున్నాడు.

నన్ను మరచిపో. మరచిపో సుందర్.

ఎప్పుడూ నిన్ను ప్రేమించే

కమల

మరిచిపొమ్మని చెప్పడం తేలిక. మరచిపోవడం ఎంత కష్టం! అందులో మనసైనవాళ్ళని మరవడమంటె ఎంతకష్టం! ఎల్లాగైనాసరే కమలని చూడాలనుకుని వెంటనే బయలుదేరి బెంగుళూరువెళ్ళి వాళ్ళనాన్నతో మాట్లాడి, ఆయన మనస్సులో మార్చాలి" అని అనుకున్నా.

కమలా వాళ్ళ యింటికి పెద్ద తాళమేసివుంది. ఏవూరు వెళ్ళిందీ ఎప్పుడు వచ్చేది మా కమలకూడా చెప్పలేక పోయింది.

కొద్దిరోజుల తరువాత కమల పెళ్ళిఫోటొ పత్రికలలో పడ్డది. ఎంత సంతోషంగా కనబడుతోంది! నాకు సంతోషానికి బదులు కోపం, దుఃఖం కలిగాయి. కొద్దిరోజులకు కోపంపోయింది. మిగిలిందల్లా ఒక్కటే కోరిక. ఎలాగైనా ఒక్కసారి కమలను కలుసుకోవాలి.

కమల ఢిల్లీలో వున్నదని మనస్సుకు ఒక్కొక్కసారి అనిపించేది. ఎక్కడో యీ మహానగరంలో తనూ భర్త వున్నారేమో, ఎడ్రసు తెలియని వ్యక్తిని యింత పట్టణంలో వెదికి పట్టడం అంటే మానవులకి సాధ్యమయ్యే పనికాదు. ఏదో అర్థంలేని ఆశ, కమలను చూడగల ననిపించేది. అటువంటి మనిషి అల్లంతదూరంలో కనిపించగానే, కమలేననుకొని వెర్రిసంబరంతో వడివడిగా అంగలువేసుకుంటూ దగ్గరకు వెళ్ళేవాడిని. కాని ఆ పిల్లది విమలో శ్యామలో అయ్యేది.

మనస్సు నిరాశతో కృంగిపోయేది. మళ్ళీ అన్వేషణ మొదలుకొచ్చేది. రెండు మాసాలు నాకు తెలియకుండా గడిచిపోయాయి. నేను ఢిల్లీ వదలి వెళ్ళే సమయం దగ్గరకు వచ్చింది. కమలమీద కోపంకూడ రావటం మొదలుపెట్టింది. తన ఆనందం కోసం, సుఖంకోసం, యింకొక వ్యక్తిని వివాహం చేసుకుంది. అటువంటి వ్యక్తిని చూడటంకోసం ఎందుకు నేను తాపత్రయపడటం? ప్రతిమనిషి తను ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకోగలిగితే ప్రంపంచంలో ఇంత అశాంతి వుండేదికాదు. మన ప్రేమలు ఫలించినంతమాత్రాన మన స్నేహాన్ని విస్మరించడం భావ్యమేనా?

ఈ ప్రశ్నలకు పమాధానాలు లేవు.

ఆనాడు బెంగుళూరులో మాయమైన కమల యీనాడు ఢిల్లీలో సాక్షాత్కరించింది.... ....

కొద్ది క్షణాలు నావంక రెప్పవాల్చకుండా చూసింది. నేనెలా మాట్లాడదామని అనుకుంటూండగానే, పిల్లవాడిని ఎత్తుకుని లోపలకు వెళ్ళబోతోంది.

అప్రయత్నంగా నా నోటివెంట "కమలా" అని వెలువడింది. ముందుకు సాగుతున్న పాదం ఆగింది. నేను మళ్ళీ "కమలా" అని పిలచాను.

రెండవ పిలుపుకు వెనక్కితిరిగి చూచింది. కనుకొలుకులుదాటి కన్నీరు చెక్కిళ్ళపైకి జారుతుంది.

"వెళ్ళిపో! వెళ్ళిపో!" అని అంది.

ఎవరో కొరడాతో వెన్నున కొట్టినట్టయింది. ఇంతలో "ఎవరదీ?" అంటూ యింకో స్వరం వినిపించింది. కమల నాన్న బయటకు వచ్చాడు. నావంక చూడగనే, "నువ్వా!" అని ఒక్కక్షణం తటపటాయించి వెంటనే 'రావయ్యా ఎప్పుడు వచ్చావు?' అంటూ నాచెయ్యి పట్టుకున్నాడు.

కమలకిదంతా అయోమయంగా వుంది. ఏడుస్తూనే నవ్వుతూంది.

అంతా కలసి లోపలకువెళ్ళాం. డ్రాయింగురూములో కమలభర్త కూర్చుని వున్నాడు. నన్ను చూడగానే ఎవరన్నట్లు భార్యవంక చూశాడు.

"ఎవరని చెప్పటం?" కమల మనస్సులోని ప్రశ్న ముఖంలో కనిపిస్తోంది.

ఈ ప్రశ్నకు కమల వాళ్ళనాన్న సమాధానం చెప్పాడు.

"ఇతనేనయ్యా మా అల్లుడు. నువ్వు పెళ్ళికి రాలేదుగా. సుందరం అని మన స్నేహితుడు. బెంగుళూరులో వున్నప్పుడు మాతో చాలా స్నేహంగా వుండేవాడు' ' అని ఉభయులకి పరిచయం చేశాడు.

అతను కరస్పర్శచేస్తూ "చాలా సంతోషం" అని అన్నాడు. ఇంతలో పిల్లవాడు దగ్గరకు వచ్చాడు. వాడి తల నిమురుతూ "మావాడిది కూడా మీపేరే' ' అని అన్నాడు.

కమల ఆ గదిలో లేదు. ముసలాయన మాత్రం "కమలా కాఫీ తీసుకురా' ' అని ఆదేశం యిచ్చాడు. నావంక తిరిగి "ఈవూరు ఎప్పుడు వచ్చావు?" అని అడిగాడు.

"సుమారు రెండునెలలయింది!"

"రెండు నెలలా?"

"అవునండి?"

"అయితే యిప్పటికన్నమాట మేము గుర్తుకొచ్చింది! ఇన్నాళ్లకా మాయింటికి రావటం?"

"కాదండి."

"నువ్వేం చెప్పొద్దు. నాకు చాలా కోపంవస్తోంది. మేమున్న సంగతే మరిచి పోయి నట్టున్నావు. ఇవ్వాళ ఏదో దారితప్పి వచ్చినట్టున్నావు. బస ఎక్కడ?"

"కరోల్‌బాగ్."

"మా ఇంటికి వచ్చేసేయ్."

"వీలు పడదండి."

"నీమాటలేం నేను వినను.... నువ్వు మాదగ్గర వుండవలసిందే."

నాతో మాట్లాడనని నావంక చూడనని ప్రమాణం చేయించుకుని, కమలకు నాకు ఎడబాటు కలిగించింది యీ వ్యక్తేనా అని అనుమానం కలిగింది. ఎంత మార్పు!...

కమల భర్త చిరునవ్వుతో మా యిద్దరివంక చూస్తున్నాడు.

కాఫీ ట్రే పట్టుకుని కమల ప్రవేశించింది. కమలతో ఒక్కక్షణం ఒంటరిగా మాట్లాడగలిగితే, ఎన్నోవేల ప్రశ్నలు అడగాలి. కాని యీ ముసలిఘటం వదిలితేనా?

చివరకు ధైర్యంచేసి "కులాసాగా వున్నావా?" అని అడిగా. సమాధానంగా తలవూపింది.

"మీ అబ్బాయి చాలా బాగున్నాడు" అని అన్నా.

ఒక్కసారి నా వంకచూసి తలవంచుకుంది. ఆ చూపులో అనేక భావాలున్నాయి. గడచిన గాథలు అనేకం కనిపిస్తున్నాయి.

నిరాశవెనుక దాగిన నిట్టూర్పు యిప్పుడు బయటకు వచ్చింది. ఈసారి ప్రశ్న వేసేవంతు కమలది.

"చెల్లాయి వాళ్ళు కులాసా?"

"ఆ!"

"ఢిల్లీ ఎప్పుడు వచ్చారు?"

"సుమారు రెండు మాసాలయింది."

తరువాత ప్రశ్న మాయిద్దరికి తెలుసు. అడిగే ధైర్యం లేక కమల కళ్ళతోనే ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని అడిగింది. "నిన్ను మరచిపోలేక" అని నాకళ్ళు సమాధానం చెప్పాయి.

ఏదో పనిమీద ముసలాయన లోపలకు వెళ్ళాడు. కమలభర్త "మీరు సాధ్యమైనంత త్వరలో మీ సామాను యిక్కడికి తెచ్చుకోండి. కమల స్నేహితులు నాకుకూడా స్నేహితులే" అని అన్నాడు.

నేను పైకి "థ్యాంక్సు" అని అన్నా. మనస్సులో మాత్రం "అంతకంటే కావలసిన దేముంది" అని అనుకున్నా.

ఇంతలో అతను లేచి "కొంచెం తొందరపనిమీద వెడుతున్నాను. మీరేమీ అనుకోవద్దు. మళ్ళీ కలుసుకుందాం. మీరు యిక్కడే వుండాలి" అని అన్నాడు. నేనుకూడా వెడదామని లేవబోతుంటే "మీరు కొంచెంసేపు మామగారితో కబుర్లు చెబుతూ వుండండి. బెంగుళూరు అంటే ఆయనకు చాల యిష్టం" అని అన్నాడు.

"మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషం" అని అన్నా.

కమల భర్తని సాగనంపి రావటానికి గుమ్మందాకా వెళ్ళింది.

చివరకు నేను కమలా ఒంటరిగా మిగిలాం. పిల్లవాడు మాయిద్దరివంకా ఆశ్చర్యంతో చూస్తున్నాడు. కమల కనిపిస్తే ఎన్నో విషయాలు అడుగుదామనుకున్నా నేను. మూగబోయి నోరుమూసుకున్నా.

కన్నీటితో నావంకచూస్తూ "నామీద కోపంవద్దు" అని అంది.

"లేదు కమలా!"

"పెళ్ళి చేసుకున్నారా?"

"నిన్ను పిలవకుండానే?"

ఏం మాట్లాడకుండా కమల ముఖం ప్రక్కకు తిప్పుకుంది. "మీ ఆయన చాలా మంచివాడులాగా వున్నాడే" అని అన్నా. భర్త విషయం కమల ముఖంలో ఆనందం కనిపించింది.

"చాలా మంచివారు. నేనంటే ఎంతో ప్రేమ" అని అంది.

నేనిక అక్కడవుండటం అనవసరమనిపించింది. 'వెడతాను కమలా!' అని అన్నా.

"అప్పుడే?" అని అంది. కాని నేను వెళ్ళిపోతేనే ఆపిల్లదానికి ఆనందం కలుగుతుందనిపించింది.

"వెళ్ళాలి. చాలా పనివుంది."

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?"

'ఎప్పుడో యిల్లాగే దారితప్పినప్పుడు!... వెళ్ళానని మీ నాన్నగారితో చెప్పు...'

"నాన్నగారిని పిలుస్తాను" అని లోపలికి వెళ్లబోతోంది.

"కమలా" అని అన్న నాకంఠంలోని బాధ ఆ పిల్లను ఆపినట్టుంది.

ఆగి నావంకచూసింది. దగ్గరకు రమ్మని చెయ్యి చాచాను. తడబడుతూ నా దగ్గరకు వచ్చింది. నాచేతిలో తన చేతిని పెట్టబోతుంటే... "వద్దు" అని కన్నీరు తుడుచుకుంటూ లోపలకు వెళ్లిపోయింది. వాళ్ళనాన్నతోబాటు తిరిగివచ్చింది.

"వెడతానండి" అని అన్నా.

"వచ్చి ఒక్కక్షణంకూడా కాలేదు. అప్పుడే వెళ్ళటం ఏమిటి?"

"చాలా పనివుంది... మళ్ళీవస్తా."

"ఉండనంటున్నావు ఏంచెయ్యను?... తొందరగా నీ సామానులు తెచ్చుకో."

"అల్లాగే. ప్రయత్నం చేస్తాను."

"పద బస్సుదాకా వస్తా" అని వెంట బయలుదేరాడు. పిల్లవాడిని ముద్దుపెట్టుకుని వాడిచేతిలో పదిరూపాయలు పెట్టా... కమల వద్దని అంది. "ఎవరైనా ఆపేక్షతో యిస్తే వద్దనకూడదు." - వాళ్ళనాన్న మందలించగా పుచ్చుకుంది.

"వస్తాను కమలా" అని ముందుకు నడిచా. కమల ఏం మాట్లాడలేదు. నన్నుదాటి ఎక్కడికో చూస్తోంది.

టాక్సీలో కూర్చున్నా. నావంకచూస్తూ ముసలాయన "ఇటుప్రక్క మళ్ళీ కనిపించావంటే ప్రాణాలతో వెళ్ళవు జాగ్రత్త" అని అన్నాడు.

టాక్సీ కదిలింది.